ఐదుగురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

స్థానిక జెడ్‌పి కార్యాలయంలో బుధవారం ఉద్యోగోన్నతుల సందడి నెలకొంది. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తన ఛాంబర్‌లో ఇద్దరు టైపిస్టులకు, ముగ్గురు జూనియర్ సహాయకులకు సీనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. జి.శ్రీనివాసరావు (టైపిస్ట్, ఎంపిపి ఎల్.కోట), ఆర్.శివప్రసాద్ (జూనియర్ అసిస్టెంట్, జెడ్‌పిహెచ్ఎస్ బోనంగి), పి.కిరణ్ (జూనియర్ అసిస్టెంట్, జెడ్‌పిహెచ్ఎస్ వేపాడ), బి.వి.ఎస్.ప్రసాద్ (టైపిస్ట్, ఎంపిపి గుర్ల), ఆర్.నాగశేఖర్ (జూనియర్ అసిస్టెంట్, ఎంపిపి పూసపాటిరేగ)కు ఉద్యోగోన్నతులు లభించాయి. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బి.వి.సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకటరామన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల కోసం 39,559 దరఖాస్తులు

కొత్త ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 39,552 దరఖాస్తులు అందాయి. సంక్రాంతి తరువాత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని సమాచారం. పాత ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి 31లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా గృహ నిర్మాణ సంస్థ కసరత్తు చేస్తోంది.

- సంక్రాంతి తరువాత లబ్ధిదారుల ఎంపిక
- పాత ఇళ్ల నిర్మాణానికి మార్చి 31 డెడ్‌లైన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెప్పున్న సంగతి విదితమే. ఇందులో భాగంగా నవంబర్ ఒకటో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. సాంకేతిక కారణాల వల్ల మన జిల్లాలో అదే నెల 8వ తేదీ వరకు వెబ్‌సైట్ తెరుచుకోలేదు. ఆ తరువాత నుంచి డిసెంబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం స్వీకరించింది. మొత్తం 39,559 దరఖాస్తులకు గాను 31,492 మంది దరఖాస్తుదారులకు సొంతంగా ఇళ్ల స్థలాలు ఉన్నాయి. మిగిలిన 8067 మందికి స్థలాలు లేవు. అత్యధికంగా రాజాం నియోజకవర్గం నుంచి 8789, అత్యల్పంగా విజయనగరం నియోజకవర్గం నుంచి 1052 దరఖాస్తులు అందాయి. సొంత ఇంటి స్థలాలు లేనివారు కూడా విజయనగరం నియోజకవర్గంలోనే తక్కువ (380 మంది) ఉన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారుల కథనం ప్రకారం లబ్ధిదారుల ఎంపిక, ప్రాధాన్యత క్రమం కూడా ఆన్‌లైన్ వెబ్‌సైటే నిర్ణయిస్తుంది. స్థలాలు కూడా లేనివారికి తొలి ప్రాధాన్యత, స్థలం ఉన్నవారిలో వారి బ్యాంకు ఆర్థిక లావాదేవీలు, తదితర నిబంధనల ఆధారంగా ఇళ్లు మంజూరు ఉంటుందని చెబుతున్నారు. అర్హులందరికీ పిఎంఎవై జి-2024 పథకం కింద ఇళ్లను మంజూరు చేయనున్నారు. ఈసారి పథకం విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని సమాచారం. గత ప్రభుత్వంలో ఇదే స్కీమ్ కింద రూ.1.80లక్షలు చొప్పున మంజూరు చేసిన విషయం విదితమే. ఈ మొత్తం ఏమాత్రమూ సరిపోకపోవడంతో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగలేదు. ముఖ్యంగా పేదలు నిర్మాణాలు పూర్తిచేయలేకపోయారు.

2019-24లో 81,999 ఇళ్లు మంజూరు కాగా, 49,055 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసినట్లు గృహనిర్మాణ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రారంభం కాని ఇళ్లు 9499 రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన ఇళ్లలో 17వేల వరకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ లేఅవుట్లలో ఉన్నాయి. మిగిలినవి లబ్ధిదారుల తమ సొంత స్థలాల్లో చేపట్టారు. లేఅవుట్లలో ప్రభుత్వ ఆధ్వర్యాన నిర్మాణం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. వీటిపై తగిన నిర్ణయం కోసం ప్రభుత్వానికి తెలియజేశామని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు.

అర్హులందరికీ ఇళ్లు

జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుంది. స్థలం లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అవ కాశం ఉన్న చోట ప్రభుత్వమే ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేస్తుంది. ప్రతి సచివాలయంలో తమ పూర్తి వివరాలతో దరఖాస్తు అందించాలి. ఈ విధంగా ఈ నెల 15లోపు 39,552 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుంది.

- గండి మురళీమోహన్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్

పాపం పసివాళ్లు

అమ్మా నాన్నల అకాల మరణంతో అనాథలైన ఆ చిన్నారులకు పాఠశాలలో పెట్టిన మధ్యాహ్న భోజనమే ఆధారమైంది. కన్నవారిని కోల్పోయిన ఆ అభాగ్యులకు పెద్దమ్మే పెద్దదిక్కు అయ్యింది... చుట్టుపక్కల వారే చుట్టాలు... పూరి గుడిసె వారికి ఆవాసమైంది. జామి మండలం జన్నివలస గ్రామానికి చెందిన విజయ్, గౌతమ్‌ల దయనీయ గాథ వింటే ఎంతటివారైనా.. కళ్లు చెమర్చాల్సిందే. కన్నీటి పర్యంతం కావాల్సిందే. గుండె తరుక్కు పోవాల్సిందే. జామి మండలం జన్నివలసలో అనాథలుగా మారిన చిన్నారులు దయనీయ పరిస్థితిపై 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం.

అనాథలుగా మిగిలిన చిన్నారులు విజయ్, గౌతమ్

- మధ్యాహ్న భోజనమే ఆధారం
- పెద్దమ్మే... పెద్ద దిక్కు
- జన్నివలసలో అనాథలుగా మారిన చిన్నారులు

ప్రజాశక్తి - జామి

జన్నివలసలో దళిత కుటుంబానికి పైలపల్లి పైడిరాజు, దేవి దంపతులకు ఇద్దరు కుమారులు విజయ్ (12), గౌతమ్ (10). విజయ్ జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి, గౌతమ్ జన్నివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు. తండ్రి పైడిరాజు వారి చిన్నతనంలోనే నోటి కేన్సర్‌తో మరణించాడు. అప్పటి నుంచి తల్లి దేవి కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమారులను సాకుతూ వచ్చింది. చివరికి ఏడు నెలల కిందట దేవి గుండెపోటుతో మృతిచెందడంతో ఇద్దరు చిన్నారులూ అనాథలుగా మిగిలారు.

పెద్దమ్మే చేదోడు

అప్పటి వరకు తమ తల్లికి చేదోడు వాదోడుగా ఉన్న పెద్దమ్మ కొండమ్మ... తల్లి మరణానంతరం చిన్నారులకు పెద్దదిక్కు అయ్యింది. పాఠశాలలో పెట్టిన ఒక్కపూట మధ్యాహ్న భోజనంతోనే కడుపు నింపుకుంటూ, కూలి పనులు చేస్తూ... ఆ చిన్నారులకు పిడికెడు అన్నం పెడుతోంది. పెద్దమ్మే అమ్మగా మారి ఆ చిన్నారులను సాకుతోంది. కొండమ్మ దయనీయ పరిస్థితిని చూసిన వారికి కడుపు తరుక్కు పోవాల్సిందే.

పూరిగుడిసెలో బిక్కు బిక్కు మంటూ..

ఇద్దరు చిన్నారులు ఊరిలో ఉన్న పూరిగుడిసెలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షం పడితే ఆ గుడిసె కూడా కారిపోతున్న పరిస్థితి. అమ్మ నాన్నల ఆలనా పాలనలో పెరగాల్సిన బాల్యం ఒంటరి జీవనం చేయాల్సిన దుస్థితి రావడం బాధాకరం. రాత్రిళ్లు ఒంటరిగా నిద్రించాల్సిన పరిస్థితుల్లో భయంగా ఉందని చెబుతున్న ఆ చిన్నారుల ఆవేదన.. అందరినీ కలచివేస్తోంది.

ప్రభుత్వమే ఆదుకోవాలి

తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో ప్రభుత్వం ఇస్తున్న తల్లికి వందనం పథకం కూడా వీరికి వర్తించలేదు. తల్లి బయోమెట్రిక్ ఉండాలన్న నిబంధన వీరికి పథకం అందకుండా చేసింది. కాబట్టి ప్రభుత్వం స్పందించి, అనాథలైన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆదుకునే హస్తం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

సహాయం చేయాల్సిన వారు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 7674096919

శ్రీనివాస్ నవలకు పురస్కారం

విజయనగరం కోట : విజయనగరానికి చెందిన రచయిత జి.వి.శ్రీనివాస్ రచించిన 'పడిలేచిన కెరటం'కు పురస్కారం లభించింది. తెలంగాణలో హనుమకొండ బుధవారం ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభలో శ్రీనివాస్ నవల ద్వితీయ బహుమతి గెలుచుకుంది. దీంతో రచయిత శ్రీనివాస్‌ను పురస్కారం, నగదు బహుమతితో ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్‌కు పురస్కారం రావడం పట్ల రచయితలు మంజరి, ఎన్.కె.బాబు, రఘునందన, నాలుగెస్సుల రాజు, చీకటి దివాకర్, పాయల మురళీకృష్ణ, పప్పు భోగారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విచ్చలవిడి పశుసంచారంపై కొరడా

విజయనగరం టౌన్ : నగరంలో విచ్చలవిడి పశు సంచారంపై నగరపాలక సంస్థ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా కొరడా ఝుళిపిస్తున్నారు. ప్రధానరహదారులపై, వీధుల్లో సంచరిస్తున్న పశువులను అదుపులోకి తీసుకొని, పశు యజమానులకు అపరాధ రుసుం విధిస్తున్నారు. నగరంలో పశు సంచారం అదుపునకు అవసరమైన అన్ని చర్యలను పకడ్బందీగా చేపడుతున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఈ విషయమై పలుమార్లు పశు యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి తెలియజేశామన్నారు. అయినా, కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పశువులను రహదారులపై విడిచి పెడుతున్నారన్నారు. ఈ పరిస్థితిని చాలా తీవ్రంగా పరిగణిస్తూ పశుసంచారాన్ని నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికైనా పశు యజమానులు జాగ్రత్త వహించి తమ పశువులను రహదారులపై విడిచిపెట్టరాదని సూచించారు.

ప్రశంసాపత్రం, బహుమతి అందుకుంటున్న టీచర్ అనురాధ, విద్యార్థులు లిఖితా స్వరాజ్, మనశ్విని

సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా సత్తా

జాతీయ, దక్షిణ భారత స్థాయికి 2 ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ప్రతిభ చాటారు. ఈ సైన్స్ ప్రాజెక్టులు జాతీయ స్థాయి, దక్షిణ భారత దేశ స్థాయికి ఎంపికయ్యాయి. సుస్థిర వ్యవసాయంపై ఉపాధ్యాయులు డి.అనురాధ మార్గదర్శకత్వంలో కె.లిఖితా స్వరాజ్, సి.హెచ్.మనశ్విని రూపొందించిన క్రాఫ్ట్ డాక్టర్ ప్రాజెక్టు దక్షిణ భారత దేశ స్థాయి, జాతీయ స్థాయికి ఎంపికైంది.

టీచర్ కేటగిరీలో పి.స్వప్న రూపొందించిన ప్రాజెక్టు 'గ్రీన్ లేబుల్' దక్షిణ భారత స్థాయికి ఎంపికైంది. వారి ప్రతిభను డిఇఒ యు.మాణిక్యం నాయుడు ప్రశంసించారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించారు. పారిశుధ్య పనితీరును గమనించారు. సిబ్బంది హాజరు పట్టికలను తనిఖీ చేశారు. రెండు బుట్టల విధానం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి ఇస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. అనంతరం 53వ నంబర్ సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ పరిసరాలను గమనించారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు చేరుకొని అక్కడ పరిస్థితులను పరిశీలించారు.

అథ్లెటిక్స్‌లో 3 బంగారు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఎంఆర్ కళాశాలలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పరుగు పోటీల్లో జిల్లా క్రీడాకారులు మూడు బంగారు పతకాలు సాధించారు. ఎం.హరీష్ 10 కిలోమీటర్లు, ఎన్.నిరంజన్ 6 కిలోమీటర్లు, యు.మహాలక్ష్మి నాలుగు కిలోమీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. వచ్చేనెల 24న రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వీరు ఎంపికయ్యారు. వీరిని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ ఆకుల రాఘవేంద్ర, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సిఇఒ హైమ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, ట్రెజరర్ వి.ఆనంద్ కిశోర్ అభినందించారు.

నేడు నెట్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు పాల్గొనే స్త్రీ, పురుష జట్ల ఎంపిక ప్రక్రియ గురువారం పాచిపెంట మండలంలోని జిటిడబ్ల్యుఎహెచ్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు, కార్యదర్శి పివిఎస్ఎన్ రాజు, ఇందుకూరి లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 28వ తేదీలలో రావులపాలెంలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు జరగనున్న నేపథ్యంలో జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. నెట్‌బాల్‌పై ఆసక్తి, ప్రతిభ కలిగిన స్త్రీలు, పురుషులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాల కోసం పిఇటి కృష్ణమూర్తి (9441141122)ని సంప్రదించవచ్చని తెలిపారు.

సుజల స్రవంతి కాలువ డిజైన్ మార్చాలి

ఎమ్మెల్యేకు ఎపి రైతుసంఘం వినతి



ఎమ్మెల్యేకు వినతి ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి -బొబ్బిలి

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువ డిజైన్ మార్చి, ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించి రైతులకు నష్టం జరగకుండా చూడాలని ఎపి రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు, సుజల స్రవంతి పోరాట కమిటీ కో-కన్వీనర్ బి.అప్పలనాయుడు కోరారు. బుధవారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు వారు వినతిపత్రం అందజేశారు. సుజల స్రవంతి ఎలైన్మెంట్‌లో 45 కిలోమీటర్ల నుంచి 99.6 కిలోమీటర్ల వరకు ప్రభుత్వ ప్రతిపాదిత డిజైన్లో మార్పులు చేసి నిపుణుల కమిటీతో సర్వే చేసి నూతన డిజైన్ చేయాలని కోరారు. ప్రభుత్వం సిద్ధం చేసిన డిజైన్‌తో లిఫ్ట్ ద్వారా నీరు తోడి రైతుల నుంచి భూసేకరణ చేసి కాలువ తవ్వాల్సి ఉందన్నారు. డిజైన్ మార్చి సుజల స్రవంతి ప్రాజెక్టు పోలవరం నుంచి తాటిపూడి రిజర్వాయరుకు పంపి అక్కడ నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, గెడ్డలు, కాలువల ద్వారా అందించవచ్చునని వివరించారు. దీనివల్ల భూసేకరణతోపాటు లిఫ్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. దీంతో ప్రభుత్వంపై భారం తగ్గుతుందని చెప్పారు. ఎమ్మెల్యే స్పందిస్తూ డిజైన్ మార్పుపై ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, ఎస్.రవిరాజు, జి.సత్యనారాయణ, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి గౌరునాయుడు, సిపిఎం పట్టణ కన్వీనర్ పి.శంకరరావు పాల్గొన్నారు.

పారా క్రీడాకారులకు అండగా ప్రభుత్వం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా క్రీడల ద్వారా వికలాంగులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి స్ఫూర్తి దాయకమైన విజయాలను అందిస్తున్నారని, ప్రభుత్వం వీరికి అండగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దుబాయ్ వేదికగా ఇటీవల జరిగిన యూత్ ఏషియన్ పారా గేమ్స్ -2025 పోటీల్లో బాడ్మింటన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన పారా క్రీడాకారుడు పొట్నూరు ప్రేమ్‌చంద్‌ను మంత్రి తన క్యాంపు కార్యాలయంలో బుధవారం అభినంది ంచారు. ప్రేమ్‌చంద్‌ను మంత్రి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్, జాయింట్ సెక్రటరీ కర్రోతు లక్ష్మి పాల్గొన్నారు.



పారా క్రీడాకారుడు ప్రేమ్‌చంద్‌ని సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

మాట్లాడుతున్న వినియోగదారుల కమిషన్ చైర్మన్ వెంకట నాగసుందర్

వినియోగదారులకు చేరువ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వినియోగదారుల సౌకర్యార్థం కన్స్యూమర్ కమిషన్ రోజురోజుకూ వారికి చేరువవుతోందని ఆ కమిషన్ చైర్మన్ ఆర్.వెంట నాగసుందర్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు అన్యాయం జరిగినప్పుడు కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కన్స్యూమర్ కమిషన్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. వినియోగదారు సొంత ప్రాంతంలోనే కేసు దాఖలు చేసుకునే సౌకర్యం ఉందని, అఫిడవిట్ ద్వారా కూడా వ్యవహారం సాగుతుందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ ఇ-కామర్స్ కొనుగోళ్లలో ఉత్పత్తి వివరాలు, తయారీ, గడువు తేది పరిశీలించాల్సిన అవసరాన్ని వివరించారు. కమిషన్ సభ్యులు బి.శ్రీదేవి, అశోక్‌కుమార్ శర్మ మాట్లాడారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో గంట్యాడ హైస్కూల్, కళాశాల విద్యార్థులు వి.దీక్షిత, ఎ.ఝాన్సీలక్ష్మి, ఎన్.నిరీక్షణ మొదటి మూడు స్థానాలు సాధించారు. వక్తృత్వ పోటీలో భోగాపురం కళాశాల విద్యార్థి కె.జయలక్ష్మి మొదటి బహుమతి సాధించింది. వీరితోపాటు జిల్లా స్థాయిలో సత్తా చాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిఎస్ఒ మురళీనాథ్, డివిఇఒ తవిటినాయుడు, సంస్కృత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లలితకుమారి పాల్గొన్నారు.

సీతంలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం కళాశాలలో ఈ నెల 22 నుంచి కాన్ఫెడరేషన్ అఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, మోడల్ క్యారిర్ సెంటర్ కలిసి ఉపాధి నైపుణ్యాల అభివృద్ధిపై మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. ఎంబిఎ, ఎంసిఎ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కార్యాలయ సంసిద్ధత, భావ ప్రకటన నైపుణ్యాలు, విశ్వాసాన్ని బలోపేతం చేయడంపై ట్రైనర్ అరుణ భావ శిక్షణ ఇచ్చారు. సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఉద్యాన' విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ

- అదనంగా 10వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో అమలు
- కలెక్టర్ రామసుందర్ రెడ్డి వినూత్న కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందింది. కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి వినూత్న ఆలోచనతో త్వరలోనే అదనంగా జిల్లాలో సుమారు పదివేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు మొదలు కానుంది. దీనికోసం వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో, సమిష్టిగా అమలుకు రంగం సిద్ధమైంది. డిఆర్‌డిఎ నోడల్ ఏజెన్సీగా, వ్యవసాయ, ఉద్యాన, సూక్ష్మ సేద్యం, విద్యుత్ తదితర శాఖలతో కన్వర్జెన్సీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించి, ఈ కార్యక్రమం అమలుకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

కార్యక్రమం లక్ష్యం

వ్యవసాయాన్ని లాభసాటి చేయాలన్న ఉద్దేశంతో కలెక్టర్ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిలో భాగంగా ప్రస్తుత రబీ సీజన్‌లో 4వేల ఎకరాలు, ఖరీఫ్‌లో 6 వేల ఎకరాలు, మొత్తంగా 10వేల ఎకరాల్లో అదనంగా వివిధ ఉద్యాన పంటల సాగు చేపడతారు. దీనిలో సేంద్రీయ పంటల సాగుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కూరగాయలు, ఆకుకూరలతోపాటు ఆయిల్‌పాం లాంటి పంటలతోపాటు, మునగ పంట సాగును ప్రోత్సహించనున్నారు.

మార్గదర్శుల ఎంపిక

సంప్రదాయ పంటల బదులు ఉద్యాన పంటలవైపు మళ్లేందుకు ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేసి, వారి పంట పొలాలతో ఐఎఫ్‌సి (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్లు)గా ఏర్పాటు చేస్తారు. వీరిలో ప్రతీ గ్రామం నుంచి ఒక రైతును మార్గదర్శిగా ఎంపిక చేస్తారు. వీరి ద్వారా సాటి రైతులను చైతన్యం చేస్తారు. వీరిని ప్రోత్సహించే ఉద్దేశంతో మండలానికి ఉత్తమ మార్గదర్శిని ఎంపిక చేసి సత్కరిస్తారు. మార్గదర్శులను ఎంపిక చేసే బాధ్యతను ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు ఆ గ్రామంలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, డిఆర్‌డిఎ ఆర్‌పిలు, ఎపిఎంలు, సిసిలతో కూడిన బృందాలు చేపడతాయి.

మార్కెట్ గ్యారెంటీ

పండించిన పంటకు సరైన మార్కెట్ ఉన్నప్పుడే సాగుకు రైతులు ముందుకు వస్తారు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసే క్లస్టర్‌ను, దాని పరిధిలోని పాఠశాల క్లస్టర్‌కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ పండించే పంటలు, అక్కడి స్మార్ట్ కిచెన్‌కు సరఫరా చేస్తారు. త్వరలో పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు కానున్నాయి. వీటికి కూరగాయలను సరఫరా చేసే విధంగా ఒప్పందం కుదురుస్తారు. మిగిలిన పంటలను రైతుబజార్లలో విక్రయిస్తారు. విశాఖపట్నం లాంటి పెద్ద నగరాలకు ఎగుమతి చేయాలని యోచిస్తున్నారు. ప్రత్యేక బ్రాండ్ పేరుతో సేంద్రీయ పంటలను విక్రయించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. మునగాకు పొడికి విదేశాల్లో సైతం ఎంతో డిమాండ్ ఉండటంతో మునగ సాగును ప్రోత్సహించాలని నిర్ణయించారు.

రైతుల ఎంపిక ఇలా..

ఉద్యాన పంటల సాగుకు నీరు ఎక్కువ అవసరం ఉంటుంది. దీంతో వినూత్న కార్యారచణను అమలు చేసేందుకు వ్యవసాయ బోర్లు ఉన్న రైతులను మొదట ఎంపిక చేస్తారు. తరువాత తమ పొలానికి సుమారు 180 మీటర్ల దూరంలోపు విద్యుత్ సౌకర్యం ఉన్న రైతులకు ద్వితీయ ప్రాధాన్యత ఇస్తారు. ఆ చుట్టుపక్కల రైతులను కూడా ఎంపిక చేసి క్లస్టర్‌గా రూపొందిస్తారు. దశల వారీగా ఇతర పొలాలకు సాగును విస్తరించి, జిల్లాలో చిన్నచిన్న కమతాలే ఎక్కువగా ఉన్నందు వల్ల, సమిష్టి వ్యవసాయం దిశగా అడుగులు వేయిస్తారు. బోర్లు తవ్వేందుకు, మోటార్లు బిగించేందుకు, ఇతర వ్యవసాయ పరికరాలు కొనుగోలు, డ్రిప్ ఏర్పాటుకు డిఆర్‌డిఎ, ప్రభుత్వ శాఖల ద్వారు రుణ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తారు.

15 రోజుల్లో మార్గదర్శుల ఎంపిక

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

ఉద్యాన పంటల సాగు పెంచే లక్ష్యంతో అమలు చేయనున్న ఈ వినూత్న కార్యక్రమంలో కీలక పాత్ర పోషించే మార్గదర్శుల ఎంపికను 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సాహ వంతులైన రైతులను మార్గదర్శులుగా ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమం అమలు చేయడానికి మండల స్థాయి అధికారులతో ఈ నెలాఖరున ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం అమలు కోసం రూపొందించిన పిపిటిని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి ప్రదర్శించారు. సమావేశంలో వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యాన శాఖ డిడి చిట్టిబాబు, ఎపిఎంఐపి పీడీ పిఎన్‌వి లక్ష్మీనారాయణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణ రావు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

విభజన వద్దని గ్రామస్తుల తీర్మానం

మెరకముడిదాం: మండలంలోని కొర్లాం పంచాయతీని విభజించాలని బుధవారం సర్పంచ్ బూర్లె పార్వతి అధ్యక్షతన గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభకు 206 మంది హాజరు అవ్వగా ఇందులో 203 మంది విభజనకు వ్యతిరేకంగా చేతులెత్తి వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. కేవలం ముగ్గురు మాత్రమే కొత్త పంచాయతీ కావాలని చేతులెత్తారు. పంచాయతీలో ఎటువంటి విభేదాలు లేవని, అంతా కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని, ఈ పంచాయతీని విడదీయరాదని పంచాయతీ ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సభలో పంచాయతీ సెక్రెటరీ వెంకటరమణ, ఎంపీటీసీ జె.శ్రీనురాజు, మాజీ సర్పంచ్ బూర్లె నరేష్, ప్రజలు పాల్గొన్నారు.

తెంటు రాజాకు ఎమ్మెల్యేల పరామర్శ

బాడంగి: మాజీ ఎమ్మెల్యే బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తల్లి సత్యవతమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న చీపురుపల్లి, పార్వతీపురం ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, బోనెల విజయచంద్ర బుధవారం మండలంలోని ముగడ గ్రామానికి వెళ్లి లక్ష్మునాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. సత్యవతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యేలతో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రీ సర్వేపై గ్రామసభ

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో ప్రభుత్వ ప్రవేశపెట్టిన సమగ్ర భూసర్వే వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ, సచివాలయ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఉక్కు పాదం

శృంగవరపుకోట: మండలంలోని ప్రభుత్వ భూములు చెరువులు, ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఇటీవల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మండలంలోని కిల్తంపాలెం రెవెన్యూలో చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని అందిన ఫిర్యాదు మేరకు బుధవారం తహశీల్దార్ శ్రీనివాసరావు మండల సర్వేయర్ రామ ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఆక్రమణలకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను సర్వే చేసి హద్దులు నిర్ధారించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తహశీల్దార్ శ్రీనివాసరావు ఆదేశించారు.

అధికారులు స్పందించాలి

శృంగవరపుకోట: అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ జిందాల్ బాధితులు బొడ్డవరలో చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. జిందాల్ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని, నేటికీ రైతుల పొలాల్లో యంత్రాలతో పనులు నిర్వహిస్తోందని అన్నారు. జిందాల్ యాజమాన్యాన్ని తమ పొలాల నుండి బయటకు పంపడంలో అధికారుల జాప్యం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

డెంకాడ: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి. హిమగాయత్రీ అన్నారు. కళాశాలలో బుధవారం వినియోగదారుల దినాన్ని పురష్కరించుకుని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల దినం ప్రాముఖ్యత, హక్కులు, ఫోరం గురించి వివరించారు. 2019 వినియోగదారుల చట్టంలోని ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జి. పైడినాయుడు, వక్తృత్వం పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన టి. గణేష్‌ను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్. శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

బొబ్బిలిరూరల్ : వ్యవసాయంలో మెలైన యాజమాన్య పద్ధతులపై మండలంలోని కారాడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త కె.భారతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు రబీ పంటలలో చేపట్టివలిసిన మేలైన యాజమాన్య పద్ధతులపై అలుగోలు రైతు సేవా కేంద్రం పరిధిలో గల రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమం నిర్వహించామన్నారు. జీవన ఎరువులు వాడకం, సేంద్రీయ వ్యవసాయం, బయో పెస్టిసైడ్, భూసారం పెంపుదల, ప్రభుత్వ లక్ష్యాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గాజులరేగ వ్యవసాయ క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.తేజేశ్వరరావు, ఎఒ యం.శ్యాంసుందర్ గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982–1983 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల బృందం తాము చదివిన పాఠశాల రుణం తీర్చుకోవడానికి రూ.50వేలు విలువ గల ఫర్నిచర్, సౌండ్ సిస్టమ్, చార్జర్‌లను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో అధికారుల ఆదేశాల మేరకు వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది చెత్త నిల్వలను తొలగిస్తూ ముందస్తు చర్యలను చేపట్టారు. ప్రధానంగా పట్టణ పరిధిలోని జి.అగ్రహారం, మెట్టకాలనీ, లావేరు రోడ్డు, గరివిడి పోవు రహదారులలో నిల్వ ఉన్న చెత్తలను జెసిబి సహాయంతో బుధవారం తొలగించారు. పట్టణ పరిధిలోని ప్రధాన కాలువలలో పేరుకుపోయిన చెత్తను వాహనాల ద్వారా తొలగించి గ్రామ శివారులో డంపింగ్ చేస్తున్నారు. వాటిని కూడా ఇతర ప్రాంతాలకు తరలించడానికి బుధవారం చర్యలు చేపట్టారు. పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎన్ రామ్మోహన్‌రావు, ఈశ్వరరావుల ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ముమ్మరంగా చెత్తనిల్వల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

బిగ్‌బాస్ విన్నర్‌ను సత్కరించిన ఎమ్మెల్యే

భోగాపురం: బిగ్‌బాస్ 9 విన్నర్‌గా నిలిచిన పడాల కళ్యాణ్ బుధవారం తన స్వగ్రామమైన సుందరపేట వచ్చిన సందర్భంగా అభిమానులు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సుందర పేట జంక్షన్ నుంచి ఆయన ఇంటి వరకు ఊరేగిస్తూ ర్యాలీగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం మాదవి ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఉపాధి పనులు పరిశీలన

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న ఫారం పాండ్ (పంటకుంట) పనులను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నాణ్యతను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడంలో పంటకుంటలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి రైతు తమ పొలంలో పంటకుంటలను నిర్మించుకోవడం వల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా, వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న తహశీల్దార్

సచివాలయం సందర్శన

మండలంలోని బొద్దాం సచివాలయాన్ని ఎంపిడిఒ సందర్శించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సకాలంలో విధులకు హాజరు కావాలని, రికార్డులు ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని, సమస్యలతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు కుటుంబ సభ్యులుగా మెలుగుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కమ్యూనిటీ పోలీసింగ్

మెంటాడ: శాంతి భద్రతల పరిరక్షణకు కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత చేరువగా పోలీసులు పని చేస్తున్నారని గజపతినగరం సిఐ జివివి రమణ అన్నారు. మండలంలోని చింతలవలస గ్రామంలో బుధవారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం ఆంధ్ర ఎస్ఐ సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఐ రమణ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద ఫోన్ కాల్స్, లింకులు, మెసేజ్‌లకు స్పందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గంజాయి నిర్మూలన విషయంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలన్నారు. అనంతరం గ్రామ యువతకు క్రికెట్ కిట్లను, గ్రామంలోని వితంతు మహిళలకు 20 కిలోలు చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. చింతలవలస సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో సిబ్బంది కొరత

- ఉన్నవారిపై ఒత్తిడితో ఇబ్బందులు
- ఫార్మసిస్ట్ విధులు పేటలో, జీతం రేగిడిలో..

ప్రజాశక్తి- రేగిడి

గ్రామీణ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. సిబ్బంది లేక ఉన్న సిబ్బందితోనే వైద్య సేవలు అందిస్తూ నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన పిహెచ్‌సిల్లో వైద్య సిబ్బంది కొరత పట్టించుకునే నాధుడే కరువయ్యారు. దీంతో పిహెచ్‌సిల్లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి.

మండలంలోని రేగిడి, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సిబ్బంది కొరతతో కొట్టిమిట్టాడుతున్నాయి. ఈ పిహెచ్‌సిల్లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీ ఉంది. ప్రతి రోగానికి ప్రస్తుత కాలంలో రక్త పరీక్షలు అవసరం. కానీ ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో వైద్యాధికారులు అసిరినాయుడు, షాహిని రాఘవన్ మందులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. రక్త పరీక్షలు లేకపోవడంతో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇక్కడ ఫార్మసిస్ట్ పోస్ట్ ఖాళీ ఉండటంతో రోగులకు డాక్టర్లు తనిఖీ చేసి ఒపి రోజులో రాసిన మందులను అక్కడ ఉన్న సిబ్బంది ఇవ్వడం గమనార్హం. ఇక్కడ ఫార్మసిస్టు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలోని యుఎన్‌పేటకు వెళ్లడంతో రేగిడిలో ఫార్మసిస్ట్ ఖాళీ అయింది. అయితే జీతం మాత్రం రేగిడి ఆరోగ్య కేంద్రంలోనూ తీసుకొని విధులు మాత్రం యుఎన్‌పేట ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆఫీస్ సబార్డినేటర్ పోస్టు ఖాళీగా ఉంది. బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐదు కీలకమైన పోస్టులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రెండో వైద్యాధికారి లేక ఆరోగ్య కేంద్రం సేవలతో పాటు గ్రామాల వారీగా104 సేవలు కూడా ఒకే డాక్టర్ చేపట్టడంతో రెండింటికీ న్యాయం చేయలేని పరిస్థితి ఉంది. ఎంపిహెచ్‌ఎస్‌ఎఫ్ పోస్ట్ కూడా భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బూరాడ సచివాలయం ఏఎన్ఎంతో పాటు సీనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఇలా సంవత్సరాలు తరబడి భర్తీ కాకపోవటంతో అక్కడ సిబ్బంది ఇబ్బందులతోనే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి రేగిడి, బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసి పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రేగిడి పిహెచ్‌సి

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రజల సౌకర్యార్థం రామతీర్థం సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ అప్డేట్ కార్యక్రమం కొనసాగుతున్నట్లు సబ్ పోస్ట్ మాస్టర్ కె.జగదీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో పేరు, చిరునామా, జన్మతేది, మొబైల్ నంబర్, ఫోటో వంటి వివరాల సవరణలు రామతీర్థం సబ్ పోస్టాఫీస్‌లో చేయించుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ సేవలు అందిస్తున్నామని, ఆధార్ అప్డేట్ అవసరం ఉన్న ప్రజలు సరైన ధ్రువపత్రాలతో పోస్టాఫీస్‌ను సంప్రదించాలని కోరారు. పోస్టాఫీస్ ద్వారా ఆధార్ అప్డేట్ చేసుకోవడం వల్ల సమయం ఆదా అవుతుందని, నమ్మకమైన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- మెంటాడ

మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా గజపతినగరం తాలూకా యుటిఎఫ్ ఆఫీసులో ముందుగా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఆడిట్ కన్వీనర్ కిల్లాడ అప్పారావు, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ట్రెజరర్ చింత భాస్కరరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా ఎ.సూరిబాబు, అధ్యక్షులుగా కె.సన్యాసి రావు, సహాధ్యక్షులుగా సిహెచ్.సత్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా కె. సత్యనారాయణ, ట్రెజరర్‌గా బి. మురళీ, మహిళా అధ్యక్షులుగా కె.నాగమణి, జిల్లా కౌన్సిలర్లుగా అశోక్ కుమార్, భవాని శంకర్, కెజివివి స్వామి, బిఎ సత్యం, చింతా వెంకటరవికుమార్, బి.పైడిరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎం.మధు, బి. కృష్ణ, జి.సత్యనారాయణ, ఎస్.సూర్యనారాయణ, ఎం.రమేష్, పి.రవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జయతి క్లస్టర్ అధ్యకులుగా ఎం.రమేష్, ట్రెజరర్ గురువులు, చల్లపేట క్లస్టర్ అధ్యక్షులుగా ఆర్.సన్యాసి రావు, ట్రెజరర్‌గా కెజివివి స్వామి, పెద మేడపల్లి క్లస్టర్ అధ్యక్షులుగా బి.పైడిరాజు, ట్రెజరర్‌గా టి.రాజారావు, మెంటాడ క్లస్టర్ అధ్యక్షులుగా బిఏ సత్యం, ట్రెజరర్‌గా బి.మురళిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి చింతా భాస్కరరావు మాట్లాడుతూ గత స్ఫూర్తితో నూతన కార్యవర్గం పని చేయాలని, ఎంపికైన నాయకత్వానికి పూర్తి స్థాయిలో యుటిఎఫ్ సంఘ సభ్యులు సహకరించాలని కోరారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - వంగర

స్థానిక మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆవరణలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ బెవర ఈశ్వర రావు, కంబాల రమేష్, జి.శంకరరావు ఆద్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు క్రిస్మస్ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ప్రార్థనా గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రమేష్, శంకర్రావు మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శక మని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని భవానీనగర్‌లో గల గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం మేరీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రసాద్ పాల్ పాల్గొని పిల్లలకు చక్కని సందేశాన్ని అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాండ్రేగుల వెంకటరాము మాట్లాడుతూ జీసస్ బోధనలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వంగర: కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

అంగన్వాడీలకు ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్వాడీలకు ఎమ్మెల్యే బేబినాయన స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. మినీ అంగన్వాడీలను అంగన్వాడీ కార్యకర్తలుగా ప్రమోషన్ ఇచ్చినట్లు చెప్పారు. అంగన్వాడీలు ఇబ్బందులు పడకుండా స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామని వీటిని ఉపయోగించి మరింత మెరుగ్గా సేవలందించాలని కోరారు. చేసినట్లు చెప్పారు. విధులు సక్రమంగా నిర్వహించాలని ఈ సదర్భంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచేలా చూడాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల, అంగన్వాడీలు ఎమ్మెల్యేను కోరారు.

అంగన్వాడీలకు ఫోన్లు పంపిణీ

కొత్తవలస: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బుధవారం ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లను దాసరి కార్పొరేషన్ చైర్మన్ డి. రత్నాజీ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ పంపిణీచ ఏశారు. ఈ సందర్భంగా రత్నాజీ మాట్లాడుతూ పిల్లలను సక్రమమైన మార్గంలో నడిపించే మొదటి అడిగే ఈ అంగనవాడీలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, హైమావతి, భాగ్యలక్ష్మి, భాగ్యవతి, నాగమణి, రమణమ్మ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తవలస: బాధితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

నేడు మనుస్మృతి దహన దినోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

జనచైతన్య మండలి, దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 25న రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆవరణ పక్కన ఉన్న డాక్టర్ అంబేద్కర్ శిలావిగ్రహం వద్ద మనుస్మృతి దహన దినోత్సవాన్ని నిర్వహిస్తామని జనచైతన్య మండలి వ్యవస్థాపకుడు పెయ్యల పావన్‌ప్రసాద్ చెప్పారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కులవ్యవస్థను పెంపుచేసే ఆటవిక, అమానవీయ, దుర్మార్గ శిక్షాస్మృతే మనుస్మృతి అని, అది అసమానతలకు నిలయమని, అధర్మ శాస్త్రమని ధ్వజమెత్తారు. దీన్ని అందరం కలిసి దహనం చేయాలని పిలుపునిచ్చారు.

సిఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ముఖ్యమంత్రి సహాయనిధి అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల పాలిట వరంగా మారిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో ఐదుగురు లబ్ధిదారులకు రూ.15.35లక్షల చెక్కులను అందించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ కొండంత భరోసా నిస్తోందన్నారు. నిరుపేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు వర్రి రమణ, కర్రెడ్ల ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు రాయవరపు శ్రీను, క్లస్టర్ ఇంచార్జ్ కొట్యాడ ఈశ్వరరావు, జామి ఆలయ కమిటీ చైర్మన్ అల్లాడ ఎర్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక కోటలో బుధవారం సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బేబినాయన పంపిణీ చేశారు. 25మంది లబ్ధిదారులకు రూ. 22,64,563 చెక్కులను అందించారు. పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని బేబినాయన చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి - చీపురుపల్లి

వాహన చోదకులు వాహనాలను నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా నడపాలని, ఎటువంటి ప్రమాదాలకూ గురికాకుండా జీవితాలను రక్షించుకోవాలని చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. నాకాబంది కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి, రాజాం సర్కిల్ పరిధిలోని 9 పోలీస్ బృందాలతో చీపురుపల్లి పట్టణంలో ముమ్మరంగా బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. చీపురుపల్లి టౌన్, గరివిడిలో చీపురుపల్లి, రాజాం సర్కిల్ పోలీసులు సుమారు 70 మందితో 9 పాయింట్స్‌లో నాకాబందీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి వెహికల్‌ను చెక్ చేసి హెల్మెట్ లేని వారు హెల్మెట్ పెట్టుకోవాలని, మైనర్ డ్రైవర్‌ను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. రికార్డులు లేని వెహికల్‌ను సీజ్ చేసి అనంతరం రికార్డులు వెరిఫై చేసి వాహనాలను యజమానులకు అప్పగించారు. అనుమతులు లేని చట్టవిరుద్ధమైన వస్తువులను రవాణా జరిపితే వాటిని సీజ్ చేయనున్నట్లు పోలీసులు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారి పైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సిఐ జి.శంకర్రావు, ఎస్ఐ ఎల్.దామోదర్ రావు, గరివిడి, మెరకముడిదాం, గుర్ల, రాజాం పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎస్‌పి రాఘవులు

పిహెచ్‌సికి పరికరాలు వితరణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

విశాఖ పెందుర్తి ఐడిబిఐ బ్యాంకు సామాజిక బాధ్యత నిధులతో లక్కవరపుకోట మండల కేంద్రంలో గల పిహెచ్‌సికి మూడు లక్షల రూపాయల విలువ గల ఉన్నత పరికరాలను వితరణగా అందించింది. ఈ మేరకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చేతులు మీదుగా బుధవారం పరికరాలను అందించారు. ఆమె మాట్లా డుతూ పెందుర్తి ఐడిబిఐ బ్రాంచ్ సీనియర్ రీజినల్ హెడ్, జనరల్ మేనేజర్ కన్వాధీబ్ సహకారంతో ఫ్రిజ్, ఎయిర్ కండీషనర్, వాటర్ ప్యూరిఫైయర్, ఇన్వర్టర్, బ్యాటరీలు, సీలింగ్ ఫ్యాన్లు, అత్యవసర ల్యాబ్ పరికరాలు, ఆరు బీపీ మిషన్లు, మూడు ఎయిర్పోర్ట్ చైర్లు, స్ట్రెచర్లు ఇచ్చారని చెప్పారు. కొత్తవలస మండలంలోని మంగళపాలెం గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ కేన్సర్ ఆసుపత్రికి కూడా ఐడిబిఐ బ్యాంకు లక్షల్లో నిధులు అందించినట్లు ఆమె తెలిపారు. ఎఎంసి చైర్మన్ మల్లునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు ఫిరోజ్, పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని రాంజీనగర్‌లో ఉన్న చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలను సిఐ సిహెచ్ షణ్ముఖరావు బుధవారం సందర్శించారు. అక్కడ పిల్లలతో ముచ్చటించి వాళ్ళు బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వాళ్లకి ఏ సమస్య వచ్చినా వెంటనే తమకు తెలియజేయాలని వారికి అండగా ఉంటామని మానవతా దృక్పథంతో వారికి చేయూత నివ్వాలని తెలిపారు. పిల్లల అవసరమైన నిత్యవసర సరుకులను అందజేసి వాళ్లతో ఆటలు పాటలు పాడించి వాళ్లతో గడిపారు.

ఉపాధి హామీ చట్టాన్ని పాత పేరుతో కొనసాగించాలి

ప్రజాశక్తి- మెంటాడ

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పేరునే కొనసాగించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కన్వీనర్ తామరపల్లి సోములు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతులు జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. బుధవారం కొండ లింగాలవలస పంచాయతీ పరిధిలో గల గజింగుడ్డివలసలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో ఉన్నాయని, వేతనదారులకు గతం కంటే కూలి రేటు తగ్గించడం అమానుషమని అన్నారు. పెరుగుతున్న నిత్యవసరాలకు అనుగుణంగా కూలి రేటు రూ.600లకు పెంచాలని, 200 రోజులు పనిదినాలు పెంచి ఉపాధి వేతనదారులను ఆదుకోవాలని కోరారు. ఎన్‌డిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పేరును మార్చడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో చల్లదుర్గ, బొప్పాది సాంబ, రాకోటి అప్పన్న, చల్ల అప్పన్న, రాకోటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చీపురుపల్లి

మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, మై భారత్ ఆధ్వర్యంలో స్థానిక బాలురు ఉన్నత పాఠశాలలో జరిగిన బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో పట్టణంలోని శ్రీవెంకటరమణ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం, సిబ్బంది విద్యార్థులను బుధవారం అభినందించారు. 200 మీటర్స్ పరుగు పందెంలో పి.వేణుగోపాల్ 3వ స్థానం, వాలీబాల్‌లో 2వ స్థానంలో ఎన్.చక్రి, బి.రిషివర్ధన్, ఎస్.సాయి, జి.దిలీప్, పి.వేణుగోపాల్, డి.వాసు నిలిచి ప్రతిభను కనబరిచి బహుమతులు దక్కించుకున్నారు. ఈ మేరకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి. బంగారు నాయుడు, ఎఒ జి. రామ్‌నాయుడు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని గెలుపొందిన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు లీల

కొత్తవలస: మండలంలోని దేవాడ గ్రామంలో గల అమరావతి పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న జి.లీల. విజయనగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ గణిత పోటీలలో ప్రథమ స్థానం సాధించింది. ఈ మేరకు ఫిబ్రవరిలో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సత్యనారాయణ విద్యార్థిని అభినందించారు.

కేన్సర్‌ను అశ్రద్ధ చేయొద్దు

ప్రజాశక్తి -శృంగవరపుకోట

కేన్సర్ లక్షణాలుంటే అశ్రద్ధ చేయొద్దని డాక్టర్ రంది త్రినాధరావు అన్నారు. విశాఖ జిల్లా ఆరిలోవ మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వెంకట సాంబశివరావు అధ్యక్షతన పట్టణంలోని సాయికృష్ణ హాస్పిటల్‌లో బుధవారం కేన్సర్ లక్షణాలు, చికిత్సపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంది త్రినాధరావు మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో యుక్త వయసులో రకరకాల కేన్సర్లు వస్తున్నాయని అందుకు ప్రస్తుత జీవన ప్రమాణాలు, ఆహారపు అలవాట్లు చెడు వ్యసనాలే కారణమని చెప్పారు. డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ కేన్సర్‌కు సంబంధించి అన్ని రకాల పరీక్షలూ ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకిషోర్, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాల విద్యార్థి కూనేటి మహేష్ (22) బుధవారం వసతి గృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ కుమార్, విద్యార్థులు అందించిన వివరాలు ప్రకారం.. సాలూరు మండలంలోని జిల్లేడువలస గ్రామానికి చెందిన మహేష్ మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకోగా, బుధవారం ఉదయం తోటి విద్యార్థులు గమనించారు. మహేష్ డిగ్రీ పూర్తిచేసి 2024లో ఉపాధ్యాయ శిక్షణ నిమిత్తం డైట్ కళాశాలలో చేరాడు. ఇక్కడే ఉన్న బాలుర వసతి గృహంలో తోటి విద్యార్థులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వసతిగృహంలో ఉన్న రీడింగ్ రూమ్‌లో సహ విద్యార్థులతో కలిసి చదువుకున్నాడు. అందరూ గదుల్లోకి వెళ్లిపోయినా మహేష్ మాత్రం అక్కడే ఉండిపోయాడు. రాత్రంతా రూమ్‌కు రాకపోవడంతో ఉదయం 6 గంటలకు ఆయన రూమ్మేట్స్ రీడింగ్ రూమ్‌కు వెళ్ళి చూశారు. అప్పటికే మహేష్ ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న వెంటనే మా సిబ్బందితో కలిసి వసతిగృహాన్ని సందర్శించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు. ఆర్‌జెడి విజయ్ భాస్కర్, డిఇఒ మాణిక్యంనాయుడు, రిటైర్డ్ డిఇఒ డాక్టర్ ఎన్‌టి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. మహేష్ మృతి పట్ల ప్రిన్సిపల్ రామకృష్ణారావు, అధ్యాపకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా ఆత్మహత్యకు పాల్పడ్డ మహేష్ చేతిలో సూసైడ్ లెటర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ లెటర్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. తన కుటుంబ పరిస్థితి, తాను ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలను అందులో పొందుపరిచినట్లు భోగట్టా. లేఖలోని వివరాలను పోలీసులు వెల్లడిస్తే కారణాలు తెలిసే అవకాశం ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు అంటున్నారు.

ఉరేసుకుని వివాహిత మృతి

పూసపాటిరేగ: వరకట్నం వేధింపులు భరించలేక తన కుమార్తె పుష్ప(19) అత్తవారింట్లో ఉరేసుకుని చనిపోయినట్లు పూసపాటిరేగకు చెందిన పాండ్రింకి రమ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. తన కుమార్తె పుష్పని మండలంలోని ఎరుకొండ గ్రామానికి చెందిన ఎస్.శివకి ఇచ్చి 3 నెల క్రితం వివాహం చేశామని చెప్పారు. తరువాత నుంచి శివ కుటుంబ సభ్యులు రూ.3 లక్షల కట్నంగా తీసుకురావాలని డిమాండ్ చేసినట్లు తెలిపింది. పెద్దలు సర్ది చెప్పి అమ్మాయిని కాపురానికి పంపించారన్నారు. అప్పటి నుండి శివ కుటుంబ సభ్యులు తన కుమార్తెను కట్నం కోసం వేధిస్తున్నట్లు తన కుమార్తె తనకు ఫోన్ చేసి తెలియజేసేందని చెప్పింది. మంగళవారం పుష్పకి ఆరోగ్యం బాగోలేదని హాస్పిటల్లో చేర్పించామని తరువాత చనిపోయిందని తనకు ఫోన్ చేసి చెప్పారని తల్లి రమ బోరున విలపించారు. వరకట్నం వేధింపులతో తన కుమార్తె ఉరి వేసుకుందని తెలిపింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించామని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

రాజాం: రాజాం నగర పంచాయతీ పరిధి సారధి రోడ్డులోని వైఎస్ఆర్ పార్క్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ వృద్ధుడును స్థానికులు గుర్తించి మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ వృద్ధుడు బుధవారం మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.

IN THE COURT OF THE HON'BLE VI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT:HYDERABAD
O.S.NO.3357 OF 2024

Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Manager ...Plaintiff

And

Sri Kundrapu Suresh, S/o. Sri K. Kanna Babu, aged about 30 years, Occ: Business, R/o. H.No.8-18-974/1, VT Agraharam, Vizianagaram, Andhra Pradesh-535004 ...Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.1,40,734.56Ps. (Rupees One Lakh Forty Thousand Seven Hundred Thirty Four and Fifty Six Paise only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to **20-01-2026** for your appearance in person or through duly appointed Advocate at **10-30**A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500 036

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE VIZIANAGARAM
GUARDIAN O.P. 18 / 2025

Between:
Smt.Oruganti Revathi .... Petitioner
And:
Sri Oruganti Kamala Babu .... Respondent

PUBLIC LEGAL NOTICE

Please take notice that the petitioner filed the above GOP against the respondent and the matter posted to 31-12-2025 for appearance of the respondent, the petitioner is the legally wedded wife of the respondent and their marriage took place on 15.08.2018 according to Hindu Rites later joined the conjugal society and the marriage consummated during their wedlock they blessed with male child on 14-02-2020 by name Rishan now he is aged 5 years and resided with the respondents and the respondent refused to send the minor to the petitioner in spite of the repeated requests and threatening that she will not allow the minor children to go to the petitioner. The petitioner is the mother and natural guardian to the minor and she is trained nurse and she is knows about the caring of the minor's health properly and as such she is entitled for the custody of her minor son and the above matter is stands posted to **31-12-2025** for appearance of the respondent here above and if anybody is having any objection / objections they are hereby directed to appear in person or through counsel on the above Honorable Dist Judge Court Vizianagaram on the above said date at **10-30 AM** failing which the matter will be decided in your absence on merits and by order of the Honourable Court.

A. HARISH,
R. RAMAKRISHNA,
P. SATYANARAYANA,
Advocates,
Opposite Old Dist Court,
Vizianagaram,
Ph. 8464841123.